సాక్షి వికారాబాద్

మంగళవారం । 20 । మే । 2025



ఏరువాక పౌర్ణమి వరకు..

తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని కొత్లాపూర్ శివారులో రేణుకా ఎల్లమ్మ తల్లి జాతర ప్రారంభమైంది. 8లో▸



హామీల అమలులో విఫలం

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆరోపించారు. 8లో▸



అరకొర సిబ్బందితో..

ఐదు క్లస్టర్ల పరిధిలో ఇద్దరు పశువైద్యులే ఉండటంతో పాడి రైతులు ఇబ్బంది పడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు నేడు ఆఖరు

తాండూరు రూరల్: తాండూరు మండలం జినుగుర్తి గేటు సమీపంలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు మంగళవారంతో గడువు ముగుస్తుందని ప్రిన్సిపాల్ శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో 40 సీట్ల చొప్పున ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేస్తామన్నారు. బాలికలకు హాస్టల్ వసతి ఉన్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా అధికారులు

అనంతగిరి: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. సోమవారం వికారాబాద్‌లోని కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం 119 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణి అర్జీల్లో ప్రాధాన్యతను బట్టి పరిష్కారించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీఓ వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

29న ఆలయ భూముల కౌలుకు వేలం

అనంతగిరి: నవాబుపేట మండలం చిట్టిగిద్ద, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో శ్రీ నంబిగురు స్వామి మఠానికి చెందిన ఆలయ భూములను కౌలుకు ఇచ్చేందుకు ఈ నెల 29న వేలం నిర్వహించనున్నట్లు ఈవో శాంతకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 60.14 ఎకరాల భూమిని 3 సంవత్సరాల పాటు సాగు చేసుకునేందుకు కౌలుకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉదయం 11గంటలకు ఆలయ ప్రాంగణంలో వేలం ఉంటుందని పాల్గొనే వారు రూ.5 వేలు డిపాజిట్ చేయాలని తెలిపారు. హక్కు పొందని వారికి డిపాజిట్ వాపసు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల రైతులు వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

నేడు కాంగ్రెస్ పార్టీ సంస్థాగత సమావేశం

తాండూరు: కాంగ్రెస్ పార్టీ తాండూరు నియోజకవర్గ సంస్థాగత సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సన్నాహక సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు టీ.రామ్మోహన్‌రెడ్డి, పరిశీలకుడిగా జిల్లా ఇంచార్జ్ వినోద్‌కుమార్ హాజరు కానున్నారు. ఈ సమావేశానికి నియోజవకర్గంలోని మండల కమిటీ, గ్రామ కమిటీ నాయకులు, ముఖ్య నాయకులు హాజరు కావాలని కోరారు.

భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించండి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న భూ నిర్వాసితులు

తాండూరు టౌన్: తాండూరు బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూమి, ప్లాట్లు ఇచ్చిన వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బాధితులు తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే శ్రీనివాస్ మాట్లాడుతూ.. తాండూరు చుట్టూ బైపాస్ రింగ్‌రోడ్డు వేస్తామని చెప్పి కోకట్, అంతారం, చెంగోల్ పరిధిలోని పలువురి నుంచి భూములు, ప్లాట్లు తీసుకుని నేటి వరకు పరిహారం చెల్లించకపోవడం సమంజసం కాదన్నారు. బాధితులు న్యాయం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే వారికి నష్టపరిహారం చెల్లించేలా చూడాలని ఆర్డీఓను వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో మహ్మద్ సాదిక్, బాలస్వామి, సురేష్, రమేష్, శ్రీనివాస్, బాల్‌రెడ్డి, వెంకటమ్మ, నర్సిములు, రాజు, వెంకటేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూములు హాంఫట్

వేల ఎకరాలు అన్యాక్రాంతం

- జిల్లాలో అటవీ విస్తీర్ణం 1,08,000 ఎకరాలు
- కబ్జాకోరల్లో 25శాతానికి పైనే..
- కొడంగల్ నియోజకవర్గంలో 2వేల ఎకరాలు
- బషీరాబాద్ – కర్ణాటక సరిహద్దులో 1,500 ఎకరాలు అక్రమార్కులపాలు
- చోద్యం చూస్తున్న అటవీ శాఖ జిల్లా అధికారులు



అనంతగిరి సమీపంలో అటవీ సరిహద్దులు రాళ్లు కప్పేసి ఆక్రమించుకున్న భూమి

వికారాబాద్: అటవీ శాఖలో అక్రమాలు.. అవకతవకలు.. ఆక్రమణలు సర్వసాధారణమైపోయాయి. అధికారులు ఎవరు ఉన్న ఈ పరంపర కొనసాగుతూనే ఉంది. అడవుల ఆక్రమణకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. రియల్టర్లు, క్వారీల నిర్వాహకులు, రిసార్ట్‌ల యజమానులు ఫారెస్ట్ భూములను యథేచ్ఛగా కబ్జాచేసి వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఆక్రమణలను అడ్డుకునేందుకు ప్రయత్నించిన అధికారులపై బదిలీవేటు పడటం అనుమానాలకు తావిస్తోంది. అటవీ భూముల్లో అభివృద్ధి పేరిట అధికారులు అవకతవకలకు పాల్పడుతున్నారు. జిల్లాలో మొత్తం 1,08,000 ఎకరాల అటవీ భూములు ఉన్నాయి. అధికారుల లెక్కల ప్రకారం 25 శాతం అంటే (సుమారు 31 వేల ఎకరాలు) ఆక్రమణకు గురైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలో 94 ఫారెస్టు బ్లాకులు ఉండగా అందులోని కొన్ని బ్లాక్‌లలో ఉన్న ఏరియా మొత్తం కబ్జా కోరల్లోకి వెళ్లి పోయింది. మరికొన్ని చోట్ల 50శాతం నుంచి 90 శాతం వరకు ఆక్రమణలకు గురయ్యాయి. గతంలో చెట్లను నరికి వ్యవసాయం చేసేవారు.. కానీ ఇప్పుడు వ్యాపార అవసరాల కోసం కబ్జాలకు పాల్పడుతున్నారు. కాపాడాల్సిన అధికారులు అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

రూ.కోట్ల విలువ చేసే ఖనిజ సంపద స్వాహా

వికారాబాద్ రేంజ్‌లోని అటవీ భూముల్లో రెండు క్వారీలు నిర్వహిస్తున్నారు. ఒకచోట రూ.160 కోట్లు, మరో చోట రూ.60 కోట్ల విలువైన ఖనిజాన్ని అక్రమంగా తవ్వి తరలించారని తేల్చారు. ఈ విషయమై గతంలో కోర్టులో కౌంటర్ కూడా దాఖలు చేశారు. తాండూరు ఫారెస్టు రేంజిలోని ఓ క్వారీలో సైతం రూ.60 కోట్ల విలువైన ఖనిజ సంపద కొల్లగొట్టారని గుర్తించి కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. దుద్యాల్ ఫారెస్టు పరిధిలోని ఓ క్వారీలో సైతం అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారని నోటీసులు జారీ చేశారు. అనంతగిరి సమీపంలోని ఫారెస్టు భూమిని ఆక్రమించిన ఓ రిసార్ట్స్ యజమానికి నోటీసులు ఇవ్వడంతో పాటు కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. పూడూరు మండలం దామగుండం సమీపంలో ఓ రిసార్ట్స్ ఫారెస్టు భూమిలో ఏర్పాటు చేయగా వారికి నోటీసులు ఇచ్చారు. కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. ఇదంతా గతంలో ఉన్న ఫారెస్టు అధికారులు చేయగా.. ప్రస్తుత అధికారులు వారితో లోపాయికారిగా వ్యవహరిస్తూ చూసీచూడనట్లు ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది ఆరు నెలల కాలంలో నలుగురు జిల్లా ఫారెస్టు అధికారులు మారారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న డీఎఫ్‌ఓ వచ్చాక మొదట్లో కాస్త హల్‌చెల్ చేయగా ఆ వెంటనే మిన్నకుండి పోయారు.

కొడంగల్ నియోజకవర్గంలో..

❖ కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని 127 సర్వే నంబర్‌లో 2వేల ఎకరాల ఫారెస్టు భూమి ఉంది. మొత్తం అన్యాక్రాంతం అయ్యింది. కేవలం 180 ఎకరాలు ఉండగా దాన్ని స్వాధీనం చేసుకొని హద్దులు ఏర్పాటు చేస్తామని ఫారెస్టు అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా రెవెన్యూ అధికారులు ఆ సర్వే నంబర్(127)ను 82కు మార్చారు. ఈ విషయం అటవీ శాఖ అధికారులకు తెలియదు. ఈ భూమి తమదేనని అటవీ శాఖ అధికారులు క్లెయిమ్ చేసుకోలేదు. దీంతో మైనింగ్ అధికారులు క్వారీలు, క్రషర్ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చారు. పెద్ద ఎత్తున మైనింగ్ తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకున్న విషయాన్ని ఆలస్యంగా తెలుసుకొని నోటీసులు ఇచ్చారు. ప్రస్తుతం మైనింగ్ నిర్వాహకులకే అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

కబ్జా చెరలో 786 ఎకరాలు

బషీరాబాద్: మండలంలో వందల ఎకరాల అటవీ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. మైల్వార్ రిజర్వ్‌డ్ ఫారెస్టులో సుమారు 676 ఫారెస్ట్ భూములను కర్ణాటక, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల రైతులు కబ్జా చేసి యథేచ్ఛగా పంటలు సాగుస్తున్నారు. ఈ రిజర్వ్ ఫారెస్టులో సుమారు 5 వేల ఎకరాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. తెలంగాణలోని నీళ్లపల్లి, జలాల్‌పూర్, ఇస్మాయిల్‌పూర్, మైల్వార్ గ్రామాలు.. సరిహద్దు అవతలి వైపు కర్ణాటకకు చెందిన గోపన్‌పల్లి, బోందంపల్లి తండా, ఇంద్రానగర్, కర్చార్‌తండాలు ఉన్నాయి. ఈ భూములకు సంబంధించి అంతర్రాష్ట్ర సరిహద్దులు తేలకపోవడంతో కబ్జాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి.

అనేక సార్లు సర్వే

అంతర్రాష్ట్ర అటవీ భూముల సరిహద్దు విషయమై గతంలో అనేక సార్లు అధికారులు సర్వే చేశారు. గతేడాది స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఈ భూముల వ్యవహారాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఉమ్మడి సర్వే నిర్వహించాలని అసెంబ్లీలో ప్రస్తావించారు. అప్పట్లో దీనిపై స్పందించిన కలెక్టర్ సర్వే చేయాలని రెవెన్యూ, అటవీ అధికారులను ఆదేశించారు. సర్వేకి కర్ణాటక అధికారులు కూడా హాజరు కావాలని లేఖ రాశారు. కానీ వారు ముందుకు రాకపోవడంతో తెలంగాణ అధికారులే ఈ ఏడాది ఫిబ్రవరి 11న సర్వే చేశారు. కర్ణాటక ప్రాంతానికి చెందిన 60 మంది రైతులు 286 ఎకరాలు, తెలంగాణ ప్రాంతానికి చెందిన సుమారు వంద మంది 396 ఎకరాలు కబ్జా చేసినట్లు తేల్చారు. చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు రెవెన్యూ, ఫారెస్టు అధికారులు ఉమ్మడి నివేదికను సమర్పించారు.



మైల్వార్‌లోని ఫారెస్టు భూములు

ఆక్రమణలు నిజమే

మైల్వార్ రిజర్వ్‌డ్ ఫారెస్టులోని కంపార్ట్‌మెంట్ 49లో 811 హెక్టార్ల భూమి ఉంది. గతంలో తాము సర్వే చేశాం. బషీరాబాద్ మండలం నీళ్లపల్లి, ఇస్మాయిల్‌పూర్, కర్ణాటకలోని మూడు గ్రామాలకు చెందిన రైతులు భూములను కబ్జా చేశారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక అందజేశాం.

– శ్రీదేవి సరస్వతి, ఎఫ్‌ఆర్‌ఓ, తాండూరు

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



బంట్వారం: మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

బంట్వారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు సిద్ధంగా ఉండాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం కోట్‌పల్లి మండల కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డితో కలిసి పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలే పార్టీకి బలం బలగం అన్నారు. బూత్ లెవల్ నుంచి పార్టీని మరింతగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చిన మెజార్టీ స్థానాలు గెలుపొందడం ఖాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, కోట్‌పల్లి మండల అధ్యక్షుడు శివకుమార్, బంట్వారం అధ్యక్షుడు మహేష్‌యాదవ్ నాయకులు కృష్ణయాదవ్, మహేందర్‌రెడ్డి, ఓగులాపూర్ రాజు, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐని సందర్శించిన ఎంపీ

అనంతగిరి: వికారాబాద్‌లోని ఐటీఐ కళాశాలను ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలలో ఉన్న ట్రేడ్‌లు, కోర్సులు తదితర విషయాలపై ప్రిన్సిపాల్ నరేంద్రబాబును అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు ఆయా రంగాల్లో ఉద్యోగాలు చేయడం గొప్ప విషయమన్నారు. ఏదైన ప్రాజెక్టు విజయవంతం చేయడంలో టెక్నీషియన్ పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నరేంద్రబాబు, అధ్యాపకులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్. రాజశేఖర్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు నరోత్తంరెడ్డి, పట్టణ అధ్యక్షులు యాస్కి శిరీష, నాయకులు వెంకట్, శివరాజు, సుధాకర్ ఆచారి, రాఘవేందర్, శ్రీనివాస్, విజయ్, వినయ్ తదితరులు ఉన్నారు.

ఆదర్శప్రాయుడు పుచ్చలపల్లి



సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

తాండూరు టౌన్: సాయుధ రైతాంగ పోరాట యోధుడు, స్వాతంత్ర్య సమర యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య అందరికీ ఆదర్శనీయుడని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె శ్రీనివాస్ అన్నారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో ఆయన వర్ధంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాయుధ రైతాంగ పోరాటంలో నిజాం ప్రభువుకు వ్యతిరేకంగా పోరాడి 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిపెట్టిన ధీరుడని కొనియాడారు. పార్లమెంటుకు సైకిల్‌పై వెళ్లి తన నిరాడంబరతను చాటుకున్న మహనీయుడన్నారు. రైతాంగ సమస్యలపై పోరాటం చేసిన ఆయన చరిత్ర అందరికీ ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు బుగ్గప్ప, మల్కయ్య, సాదిక్, బాలస్వామి, రాజు, సురేష్, సంజు తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

రైతుల ఖాతాల్లో రూ.48 కోట్లు జమ

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

దోమ: కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ హెచ్చరించారు. సోమవారం దోమ మండల కేంద్రంతో పాటు ఆయా సెంటర్లను అయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 128 కేంద్రాల ద్వారా 33,226 మెట్రిక్ టన్నులు సేకరించి మిల్లులకు తరలించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి రైతుల ఖాతాల్లో రూ.48 కోట్లు జమ చేసినట్లు వివరించారు. అనంతరం మోత్కూర్‌లోని మహాలక్ష్మి రైస్‌మిల్లు, పరిగి పట్టణంలోని శ్రీ వెంకటసాయి రైస్ మిల్లును సందర్శించారు. ధాన్యం నిల్వలు తడవకుండా చూసుకోవాలని మిల్లు యాజమానులకు సూచించారు. లారీలను ఖాళీ చేయించి త్వరితగతిన కొనుగోలు కేంద్రాలకు పంపించేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరత ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ తుక్యానాయక్, డీటీ గణేశ్ పాల్గొన్నారు.

ఆమనగల్లువాసికి కీర్తిరత్న పురస్కారం

ఆమనగల్లు: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, ప్రముఖ కవి దాస ఈశ్వరమ్మను కీర్తిరత్న పురస్కారం వరించింది. పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన శ్రీగౌత మేశ్వర సాహితి కళాసేవా సంస్థ ఏటా సాహిత్యరంగంలో విశేష సేవలు అందించే వారికి పురస్కారాలు అందిస్తోంది. ఈ ఏడాది ఈశ్వరమ్మ అందించిన సాహిత్య సేవలకుగాను ఆమెను ఎంపిక చేశారు. మంథనిలో జరిగిన కార్యక్రమంలో ఈశ్వరమ్మకు శ్రీ గౌతమేశ్వర సాహితి కళాసేవా సంస్థ అధ్యక్షుడు దూడపాక శ్రీధర్ కీర్తిరత్న పురస్కారం అందించారు. ఈశ్వరమ్మ రాసిన కవితలకు గాను సాహితీ సౌమిత్రి అనే బిరుదుతో సత్కరించారు. కార్యక్రమంలో సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.



ఈశ్వరమ్మకు పురస్కారం అందిస్తున్న నిర్వాహకులు

సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా ఇంటర్ నోడల్ ఆఫీసర్ శంకర్



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ నోడల్ ఆఫీసర్ శంకర్

అనంతగిరి: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్ నోడల్ ఆఫీసర్ ఎన్ శంకర్ ఆదేశించారు. సోమవారం వికారాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, కస్టోడియన్లు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ రవాణా సదుపాయం కల్పిస్తుందన్నారు. ప్రతి కేంద్రంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్షలు.. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విదార్థులకు పరీక్షలు ఉంటాయని వివరించారు. సమావేశంలో జిల్లా పరీక్షల సమన్వయ కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి, సత్తయ్య, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యుడు కుమార స్వామి, ప్రిన్సిపాళ్లు సురేశ్వర స్వామి, వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి వడ్లు అక్కడే..!

- కొనుగోలు కేంద్రాల్లోనే 14 వేల ధాన్యం బస్తాలు
- లారీల కొరతతో మిల్లులకు తరలించని వైనం
- వర్షాలకు తడుస్తున్న వడ్లు
- ఆందోళనలో రైతులు
- పట్టించుకోని అధికారులు





కాశీంపూర్ కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యం బస్తాలు (ఇన్‌సెట్‌లో) గన్నీ బ్యాగులు లేక అలాగే ఉంచిన ధాన్యం

బషీరాబాద్: ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం బస్తాలు తడిసి ముద్దవుతున్నాయి. బషీరాబాద్ మండలంలో ఐదు సెంటర్ల ద్వారా వడ్లు సేకరిస్తున్నారు. కాశీంపూర్‌లో ఐకేపీ ద్వారా, నావంద్గీ, నవల్గా, దామర్‌చెడ్, మైల్వార్ గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 30 వేల బస్తాల సేకరించారు. ఇందులో 16 వేల బస్తాలు మిల్లులకు తరలించిగా మరో 14వేల బస్తాలు కేంద్రాల్లోనే ఉండిపోయాయి. తూకాలు ముగిసిన వెంటనే ధాన్యం బస్తాలను అగ్గనూర్ సమీపంలోని వెంకట పద్మావతి, లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలోని బాలాజీ రైస్ మిల్లులకు తరలించాలి. కానీ లారీల కొరతతో రవాణా ఆగిపోయింది. వర్షం పడిన ప్రతిసారీ ధాన్యం బస్తాలు తడిసిపోతున్నాయని అధికారులు చెబుతున్నారు.

గన్నీ బ్యాగుల కొరత

మండలానికి సరిపడా గన్నీ బ్యాగులు సరఫరా కాలేదు. దీంతో రైతులు వడ్లను రోడ్ల మీద, కల్లాల్లోనే ఉంచుతున్నారు. గన్నీ బ్యాగులు సరఫరా చేయాలని కేంద్రాల నిర్వాహకులు అధికారులను కోరగా కొరత ఉందని అంటున్నారు. ప్రస్తుతం 15 వేల వరకు గన్నీ బ్యాగులు అవసరమని నావంద్గీ సొసైటీ సీఈఓ వెంకటయ్య తెలిపారు.

తేమ శాతం పేరుతో లారీ వెనక్కు

మండలంలోని మైల్వార్ కొనుగోలు కేంద్రం నుంచి మూడు రోజుల క్రితం ధాన్యం లోడ్‌తో ఓ లారీ వెంకట పద్మవతి రైస్ మిల్లుకు వెళ్లింది. అయితే తేమ శాతం అధికంగా ఉందంటూ మిల్లు యజమాని లారీని మైల్వార్ కేంద్రానికి తిప్పి పంపించారు. అధికారులు పరిశీలిస్తే తేమశాతం 17 వచ్చింది. మిల్లు యజమాని తీరుతో తాము తీవ్రంగా నష్టపోయామని మైల్వార్ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదరు మిల్లు యజమానిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

ఆగని రేషన్ బియ్యం దందా

పోలీసుల దాడిలో
పట్టుబడిన రేషన్ సన్న బియ్యం



పోలీసుల దాడిలో పట్టుబడిన రేషన్ సన్నబియ్యం

కుల్కచర్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకం సైతం అక్రమార్కుల ధనార్జనలో భాగమైంది. దొడ్డుబియ్యం అయితే ఏముంది సన్నబియ్యమైతే ఏముంది అనుకున్నారు రేషన్ అక్రమ సరఫర నిర్వాహకులు లబ్ధిదారుల నుంచి కొంచెం ధర ఎక్కువ ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న కుల్కచర్ల ఎస్ఐ రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం దాడులు నిర్వహించగా చౌడాపూర్ గ్రామానికి చెందిన చిట్టెల చంద్రశేఖర్ తన గోదాంలో ఐదు క్వింటాళ్ల రేషన్ సన్నబియ్యం నిల్వ ఉంచినట్లు గుర్తించారు. లబ్ధిదారులు తమ ఇష్టంతో అమ్మితేనే కొనుగోలు చేశానని బియ్యం విక్రేత పోలీసులకు తెలిపినట్లు సమాచారం. చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసి బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం



నవనీత (ఫైల్)

అనంతగిరి: వికారాబాద్ ఠాణా పరిధిలో ఓ యువతి అదృశ్యమైంది. సీఐ భీంకుమార్ తెలిపిన ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని గిరిగేట్‌పల్లికి చెందిన వడ్డె నవనీత(19) ఈ నెల 16న భోజనం చేసిన తర్వాత నిద్రకు ఉపక్రమించింది. ఉదయం లేచి చూడగా ఆమె ఇంట్లో కనిపించలేదు. ఎక్కడ వాకబు చేసినా ఆమె ఆచూకీ లభ్యమవ్వలేదు. ఈ మేరకు సోమవారం ఆమె తల్లి సరిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి అదృశ్యం



నర్సింలు (ఫైల్)

అనంతగిరి: వివాహానికి వెళ్లిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ భీంకుమార్ తెలిపిన ప్రకారం.. మోమిన్ పేట మండలం రాంనాథ్‌గుడుపల్లికి చెందిన చాకలి పెద్ద నర్సింలు(75) ఈ నెల 16న వికారాబాద్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బంధువుల వివాహానికి హాజరయ్యాడు. అనంతరం పూడూర్‌లోని చిన్న కూతురు ఇంటికి వెళ్తున్నాని చెప్పి బయలుదేరాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో సాధ్యమైన ప్రాంతాల్లో వాకబు చేసినా ఆచూకీ లభ్యమవ్వలేదు. ఈ మేరకు ఆయన కూతురు వరమ్మ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

ఏరువాక పౌర్ణమి వరకు..

రేణుకా ఎల్లమ్మ తల్లి జాతర
- 30న రథోత్సవం, సిడే
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయాధికారులు



ముస్తాబైన ఆలయం



గర్భగుడిలో కొలువైన అమ్మవారు

తాండూరు రూరల్: తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని కోత్లాపూర్ శివారులో రేణుకా ఎల్లమ్మ తల్లి జాతర ప్రారంభమైంది. ఈ ఉత్సవాలు జూన్ 11న ఏరువాక పౌర్ణమి వరకు కొనసాగుతాయి. భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న అమ్మవారి జాతరకు రాష్ట్రంలోని ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, హైదరాబాద్ తోపాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారికి దర్శించుకుంటారు. ప్రతీ శుక్రవారం, మంగళవారం భక్తులు బోనంతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. నూతన దంపతులు అమ్మవారి సమక్షంలో ఒడిబియ్యం పోసుకుంటారు.

ఆలయ చరిత్ర

మండల పరిధిలోని కోత్లాపూర్‌లో వెలిసిన రేణుక ఎల్లమ్మ ఆలయానికి 850 ఏళ్ల చరిత్ర ఉన్నట్లు గ్రామస్తులు చెప్పారు. గ్రామానికి చెందిన రాళ్ల రాగిరెడ్డి తన పొలంలో గుంటుకతో పొలంను చదును చేస్తుండగా.. ఓ రాయి గుంటుకకు అడ్డు తగిలింది. వెంటనే ఆ రాయిని గుంటుక మీద పెట్టి పొలంలో మరల చదును చేస్తుంటే తిరిగి అదే స్థలంలోకి వెళ్లింది. రెండు మూడు సార్లు అలాగే జరిగింది. ఓ రోజు రాత్రి రాగిరెడ్డి నిద్రిస్తుండగా ఎల్లమ్మ తల్లి కలలోకి వచ్చి గుంటుకకు అడ్డు వచ్చిన రాయిని తానేనని.. అక్కడ ఆలయం నిర్మించాలని చెప్పింది. దీంతో అక్కడ గుడి నిర్మించి పూజలు చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆలయాభివృద్ధికి పాటుపడిన కర్ణాటక మాజీ మంత్రి

కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన మాజీ విద్యాశాఖ మంత్రి అరవింద్ లింబావళి ఇలవేల్పు కోత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ తల్లి. అమ్మవారి దయతోనే తాను రాజకీయంగా రాణించాలని చిన్న గుడిలా ఉన్న రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని కోట్లాది రూపాయలు వెచ్చించి ఆలయాభివృద్ధి చేశాడు. ప్రతీ ఏడాది రెండు మూడు సార్లు అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. ప్రస్తుతం ఉత్సవాలకు ఆలయ ప్రాంగణంలో బండలు, రంగులు వేయించారు. 2001 నుంచి ఈ ఆలయం దేవాదాయ శాఖ పరిధిలోకి వెళ్లింది.

30న ప్రధాన ఘట్టం

ఈ నెల 30వ తేదీ శుక్రవారం సాయంత్రం 4.30గంటలకు జాతరలో ప్రధాన ఘట్టమైన రథోత్సవం, సిడే ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొలకల పౌర్ణమికి ప్రారంభమైన ఈ జాత ఏరువాక పౌర్ణమితో ముగుస్తుంది.

పోలీసు బందోబస్తు

జాతర సందర్భంగా కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నారు. రథోత్సవం, సిడే ఊరేగింపు సందర్భంగా నియోజకవర్గంలోని సీఐ, ఎస్ఐ, కానిస్టేబుళ్లతో భారీ బందోబస్తు నిర్వహించనున్నారు. జినుగుర్తి పీహెచ్‌సీ తరుపున వైద్య సాదుపాయం కల్పిస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ నవీన్‌రెడ్డి, ఈఓ శేఖర్‌గౌడ్ తెలిపారు. భక్తులు వంటలు చేసుకునేందుకు ప్రత్యేక షెడ్లతో పాటు తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేసి నిత్యం పర్యవేక్షిస్తున్నామని వివరించారు.. గ్రామస్తుల సహకారంతో జాతర వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న పీరంపల్లి కాంగ్రెస్ నాయకులు

పరిగి: హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం పట్టణంలోని ఆయన నివాసంలో కుల్కచర్ల మండలం పీరంపల్లికి చెందిన 20 మంది కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజానీకం కేసీఆర్ పాలన రావాలని కోరుకుంటున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రవేశపెట్టిన పథకాలే ప్రభుత్వం కొనసాగించేందుకు ఇబ్బంది పడుతోందని.. కొత్తగా వారు చేసిందేమీ లేదని విమర్శించారు. గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని ప్రజలు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వ పట్టింపు కరువయిందన్నారు. బీఆర్‌ఎస్ నుంచి వెళ్లిన నాయకులు త్వరలోనే సొంత గూటికి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎక్కువ సీట్లు గెలుచుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో మార్పు కోసమే ఆర్‌ఎస్‌ఎస్

ప్రాంత కార్యకారిని సభ్యుడు సుబ్రహ్మణ్యం



ఆర్‌ఎస్‌ఎస్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న సంఘం నాయకులు

కుల్కచర్ల: హిందుత్వవాదాన్ని బలోపేతం చేయడం.. సమాజంలో మార్పు తెచ్చేందుకే ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తోందని ప్రాంత కార్యకారిని సభ్యుడు సుబ్రహ్మణ్యం అన్నారు. మండల కేంద్రంలో వారం రోజులుగా కొనసాగుతున్న శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ఎస్ వంద సంవత్సరాలు పూర్తిచేసుకున్న క్రమంలో నాటి నుంచి నేటి వరకు ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. అంటరానితనాన్ని నిర్మూలించడం, అనాగరిక చర్యల నిర్మూలన, సేవాకార్యక్రమాలు నిర్వహణ, హిందుత్వంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆర్‌ఎస్‌ఎస్ ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు శేరి రాంరెడ్డి, జిల్లా సంఘ చాలక్ గోవర్ధన్ రెడ్డి, జిల్లా కార్యావాహ సంఘమేశ్వర్, రవి, శ్రీను, రమేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలతో విద్యార్థులకు మేలు

ఎంఈఓ అబ్దుల్ రెహమాన్



ప్రతిభ కనబరిచిన విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఎంఈఓ రెహమాన్

నవాబుపేట: వేసవి శిబిరాలు విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుస్తాయని మండల విద్యాధికారి అబ్దుల్‌రెహమాన్ అన్నారు. మండల పరిధిలోని కడ్చర్ల ప్రాథమిక పాఠశాలలో పది రోజులుగా నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ మాట్లాడుతూ.. శిక్షణ ఫౌండేషన్, ప్రభుత్వం సంయుక్తంగా ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు సాంస్కృతిక , సృజనాత్మకత తదితర కార్యక్రమాలు నిర్వహించామన్నారు. శిబిరంలో 50 మంది విద్యార్థులు పాల్గొనగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఫౌండేషన్ నిర్వాహకులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు అశోక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల మనుసు గెలుచుకున్న తహసీల్దార్

బదిలీపై వెళ్లిన అధికారికి ఘనంగా వీడ్కోలు



తహసీల్దార్ వెంకటేశ్‌ను సన్మానిస్తున్న కార్యాలయ అధికారులు, సిబ్బంది

బషీరాబాద్: భూ సమస్యలు పరిష్కారంలో తహసీల్దార్ వెంకటేశ్ శక్తి వంచన లేకుండా రైతుల మనుసు గెలుచుకున్నారని బషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది కొనియాడారు. బషీరాబాద్ తహసీల్దార్‌గా 16 నెలలు పనిచేసిన వెంకటేశ్ సంగారెడ్డికి బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం కార్యాలయం అధికారులు, సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రుక్సానాబేగం, ఆర్ఐ నాగార్జున రెడ్డి, జూనియర్ అసిస్టెంట్స్ కృష్ణకుమార్, నవీన్, అంజిలప్ప, రికార్డు అసిస్టెంట్స్ నర్సమ్మ, బిచ్చప్ప, ముణ్యప్ప కంప్యూటర్ ఆపరేటర్ అరుణ్ కుమార్, వీఆర్‌ఏలు శ్యామప్ప, మాడప్ప, నర్సప్ప, రాజు, హన్మంతు, అటెండర్స్ అనంతయ్య, సిద్ధప్ప తదితరులు పాల్గొన్నారు. అనంతరం మీడియా ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో విలేకరులు నర్సింలు, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాందాస్, శ్రీనివాస్, హరిదాస్, జీవన్గీ నర్సిములు, గోపాల్‌తో పాటు మండల యువజన కాంగ్రెస్ నాయకుడు మాణిక్‌రావు తదితరులున్నారు.

నేటి నుంచి కెపాసిటీ బిల్డింగ్‌పై టీచర్లకు శిక్షణ



శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ విజయరామారావు తదితరులు

దుద్యాల్: ఐదు రోజుల పాటు ఉపాధ్యాయులకు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నట్లు మండల విద్యాధికారి విజయరామారావు తెలిపారు. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న ఈ శిక్షణకు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రాథమిక స్థాయి ఎల్ఎఫ్ఎల్ హెడ్‌మాస్టర్లకు, టీచర్లకు కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. దాదాపుగా 50 మందికి పైగా ఉపాధ్యాయులు శిక్షణకు హాజరవుతారని చెప్పారు. శిక్షణకు హాజరయ్యే ఉపాధ్యాయులకు జియో ట్యాగింగ్ హాజరు ఉంటుందని, శిక్షణ కేంద్రంలోకి వచ్చిన తర్వాతే హాజరు పడుతుందని, ఈ విషయం ప్రతీ ఉపాధ్యాయుడు గుర్తుంచుకోవాలని సూచించారు.

సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి ఫోన్ అందజేస్తున్న పోలీసులు

కొడంగల్ రూరల్: యాలాల మండలం గిరిజాపురం గ్రామానికి చెందిన మైలారం గోపాల్ ఇటీవల కొడంగల్ వచ్చినప్పుడు తన ఫోన్ పోగొట్టుకున్నాడు. అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ సాయంతో ఫోన్‌ను ట్రాక్ చేశారు. సోమవారం ఎస్ రాజ్ కుమార్, కానిస్టేబుల్స్ బలరాంనాయక్, పరమేశ్ బాధితుడికి ఫోన్ అందజేశారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కుల్కచర్ల: ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్ఐ రమేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన సిబ్బందితో కలిసి వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రతీ ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు, పోలీసు సిబ్బంది అంజి తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుకు ఎద్దు మృతి



ఎద్దు కళేబరం వద్ద రైతు శ్రీనివాస్

తాండూరు రూరల్: పాము కాటుకు ఎద్దు మృత్యువాత పడింది. ఈ ఘటన సోమవారం పట్టణ సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు.. పట్టణంలోని భద్రేశ్వర ఆలయం ఎదుట కాలనీలో నివాసం ఉంటున్న రైతు పొట్టు శ్రీనివాస్‌కు రసూల్‌పూర్ ఆలయ సమీపంలో వ్యవసాయ భూమి ఉంది. ఈ క్రమంలో ఆయన ఎడ్లను మేపుతుండగా వరిబందంలో నాగుపాటు కాటేయడంతో అక్కడికక్కడే మృత్యువాత పడింది. ఎద్దు విలువ రూ.50 వేలు ఉంటుందని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.



అంతారంరలో కాడెద్దు కళేబరం

పిడుగుపాటుతో..

మండల పరిధిలోని అంతారంలో సోమవారం పిడుగు పాటుకు కాడెద్దు మృత్యువాత పడింది. వివరాలు.. గ్రామానికి చెందిన బొడ్డె ప్రభాకర్ కాడెద్దుతో పాటు పశువులను మేతకోసం తీసుకెళ్లాడు. సోమవారం సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో పొలంలో ఉన్న కాడెద్దుపై పిడుగుపడడంతో కాడెద్దు మృత్యువాత పడింది. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలకు డిమాండ్



ఎంపీడీఓ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న కేసారం గ్రామస్తులు

మోమిన్‌పేట: పంచాయతీ కార్మికుడిపై దాడికి పాల్పడిన వారిపై చరయలు తీసుకోవాలని కేసారం గ్రామస్తులు ఎంపీడీఓను కోరారు. ఈ మేరకు సోమవారం గ్రామానికి చెందిన చంద్రయ్య ఆధ్వర్యంలో ఎంపీడీఓ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుడు నర్సింలుపై శనివారం గ్రామానికి చెందిన దినేశ్‌కుమార్, సుకుమార్ మరో వ్యక్తి అకారణంగా దాడికి పాల్పడ్డారని. దీంతో ఆయన ఆస్పత్రి పాలయ్యాడయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎద్దు మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

తాండూరు సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌కు బాధితురాలి వినతి



వినతిపత్రం అందజేస్తున్న బాధితురాలు, కేవీపీఎస్ నాయకులు

తాండూరు టౌన్: విద్యుత్ కంచె వేసి ఎద్దు మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ నాయకులతో కలిసి బాధితురాలు తాండూరు సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ నెల 12న మండల పరిధిలోని బిజ్వార్‌లో పిట్ల యశోదకు చెందని ఎద్దు మేత మేస్తుండగా విద్యుధాఘాతంతో మృత్యువాత పడింది. అనుమతి లేకుండా పొలం చుట్టూ కంచె వేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నష్టపరిహారం చెల్లించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య, బుగ్గప్ప, అబ్బులప్ప, మొగులప్ప, బాలప్ప తదితరులు ఉన్నారు.

వేధింపులు తాళలేక..

వివాహిత బలవన్మరణం



అశ్విని(ఫైల్)

అనంతగిరి: వేధింపులు తాళలేక ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన వికారాబాద్ పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సీఐ భీంకుమార్ తెలిపిన ప్రకారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన వడ్ల హన్మండ్లు-చంద్రకళ దంపతుల కుమార్తె అశ్విని(39)కి వికారాబాద్‌కు చెందిన కమ్మరి శ్రావణ్‌కుమార్‌తో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. కుటుంబ పోషణకు అశ్విని టైలరింగ్ షాప్ నిర్వహిస్తుండేది. పెళ్లైన ఐదేళ్ల తర్వాత శ్రావణ్‌కుమార్ తాగుడుకు బానిసై తరచూ భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలో ఆస్తి పంచాలని అన్నను కోరడంతో నీ భార్య ఉన్నంత వరకు పంపకాలు చేసేది లేదని చెబుతున్నారంటూ ఈ నెల 18న మధ్యాహ్నం హనుమాండ్లకు ఫోన్ చేసి చెప్పాడు. అనంతరం భార్యతో గొడవ పడ్డాడు. దీంతో మనస్తాపం చెందిన అశ్విని అర్ధరాత్రి ఆమె బెడ్రూంలోని సీలింగ్‌ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం గమనించిన శ్రావణ్‌కుమార్ అదే రాత్రి 1.50గంటలకు మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చే వరకు మృతదేహాన్ని వికారాబాద్ మార్చురీలో భద్రపరిచారు. మృతురాలి తండ్రి తన కూతురు మృతిపై అనుమానాలు ఉన్నాయని పోలీసులకు పిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భూ యాజమాన్య హక్కులు కల్పించండి

మంత్రి పొంగులేటికి 36 మంది రైతుల వినతి

ధారూరు: ముత్తాతల కాలం నుంచి కాస్తులో ఉంటూ సాగు చేసుకుంటున్న భూములు అక్రమంగా పట్టా చేసుకున్నారంటూ బూర్గుగడ్డకు చెందిన 36 మంది రైతులు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. నాగసమందర్ సమీపంలోని బూర్గుగడ్డ సర్వే నంబర్ 8, 10/ఆ/1, 12, 16, 17 లలో 26.31 ఎకరాల భూమిని 26 మంది రైతులు 1952 నుంచి సాగుచేసుకుంటున్నారు. ఇందులో కొంతమందికి టెనెంట్ హక్కులు రాగా మరి కొంతమందికి రాలేదు. ఈ భూములకు తామే 2017 వరకు భూముల పన్నులు చెల్లించామని వారు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ధరణిని ఆసరాగా చేసుకుని కొంతమంది బీఆర్‌ఎస్ నాయకులు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి అక్రమంగా ఈ భూములను కొంతమందికి రిజిస్టర్ చేయించారని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ జరిపి వాస్తవం మేరకు అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారి పట్టాలు రద్దు చేసి తమకు భూయాజమాన్య హక్కులు కల్పించాలని కోరారు.

మారిస్తేనే మనుగడ

- కేబుల్ లైఫ్ టైం 25 ఏళ్లలోపే!
- ఆ లోపే మార్చేయాలి.. లేదంటే ప్రమాదాలు తప్పవు
- లోడుకు తగ్గ వైరింగ్, ఎంసీబీలు, ప్రాపర్ ఎర్తింగ్‌తోనే రక్షణ
- 'సాక్షి'తో ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు కార్యదర్శి కాంతారావు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'సాధారణంగా ఈ కేబుల్ జీవిత కాలం 25 ఏళ్లు మాత్రమే. ఆలోపే వాటిని మార్చేయాలి. ఐఎస్ఐ ప్రమాణాల మేరకే ఈ వైర్లను రూపొందించినప్పటికీ..వాటి సామర్థ్యానికి మించి లోడు కరెంట్‌ను వినియోగించడం, అంతర్గతంగా తలెత్తే వేడికి బయటి ఉష్ణోగ్రతలు తోడవడంతో ఆయా కేబుళ్లు తీవ్రమైన ఒత్తిడికి లోనైవుతుంటాయి. జాయింట్లు, లూజు కాంటాక్ట్‌ల వద్ద తరచూ స్పార్క్‌లు వెలుగు చూస్తుంటాయి. ఇటీవల వెలుగు చూస్తున్న మెజార్టీ విద్యుత్ ప్రమాదాలకు ఇదే ప్రధాన కారణం' అని ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు కార్యదర్శి, ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్ టి.కాంతారావు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. గృహాలు, వాణిజ్య సముదాయాల్లో తరచూ వెలుగు చూస్తున్న విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన మాటల్లోనే..

పాతవైర్లపైనే అదనపు లోడు..

మెజార్టీ గృహాలు, వాణిజ్య సముదాయాల్లో 1.5 స్క్వేర్ ఎంఎం, 2.5 స్క్వేర్ ఎంఎం సామర్థ్యానికి మించిన కేబుళ్ల వాడటం లేదు. ఈ కేబుళ్ల జీవిత కాలం కూడా 25 ఏళ్లకు మించి ఉండదు. అంతేకాదు ఒకప్పుడు సాధారణ మధ్య తరగతి కుటుంబంలో పది లైట్లు, నాలుగు ఫ్యాన్లు, ఒక టీవీ, కూలర్, రిఫ్రిజిరేటర్, కంప్యూటర్, మిక్సీ, ఐరెన్ బాక్స్ మాత్రమే కన్పించేవి. తీరా ఆదాయం, ఇంటి అవసరాలు పెరిగిన తర్వాత వాటి సరసన ఏసీలు, గీజర్లు, వాషింగ్ మిషన్లు వచ్చి చేరుతున్నాయి. ఫలితంగా విద్యుత్ వినియోగం రెట్టింపవుతోంది. ఆ మేరకు పాత లైన్లను తొలగించి, వాటి స్థానంలో ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా వైర్లను ఏర్పాటు చేయడం లేదు. ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన పాతలైన్లపై మరింత భారాన్ని మోపుతున్నారు. ఫలితంగా కేబుళ్ల ఒత్తిడికి గురై...షార్ట్ సర్క్యూట్‌లు తలెత్తుతున్నాయి. అంతేకాదు నిర్మాణ సమయంలో భవిష్యత్తు విద్యుత్ అవసరాలను అంచనా వేయలేక పోవడం వెరసి నిర్మాణ ఖర్చును తగ్గించుకునే క్రమంలో నాసిరకం విద్యుత్ వైర్లు, స్విచ్‌లు కొనుగోలు చేస్తుండటం కూడా ఈ ప్రమాదాలకు మరో కారణం. అంతేకాదు ఒకే సాకెట్ నుంచి మల్టీపుల్ ప్లగ్ కనెక్షన్లు ఇవ్వడం కూడా ప్రమాదాలకు కార ణమవుతోంది.

ఒత్తిడితోనే కంప్రెసర్లలో పేలుళ్లు..

ఇతర ఎలక్ట్రికల్ వస్తువులతో పోలిస్తే ఏసీ, గీజర్, వాషింగ్ మిషన్, ఓవెన్లకు విద్యుత్ లోడు ఎక్కువ అవసరం. సాధారణంగా మార్కెట్లో ఒకటి, ఒకటిన్నర, రెండు టన్నుల సామర్థ్యం ఏసీలు లభిస్తుంటాయి. ఏసీ సామర్థ్యాన్ని బట్టి కేబుళ్లను ఎంపిక చేసుకోవాలి. సాధారణంగా 1.5 టన్ను ఏసీకి 4 నుంచి 6 స్క్వేర్ ఎంఎంపైగా కేబుల్స్ వినియోగించాలి. కానీ మెజార్టీ భవనాల్లో 2.5 స్క్వేర్ ఎంఎం కేబుళ్లనే వాడుతున్నారు. పాత ఏసీల్లో ఇన్వర్టర్ మోడ్ సహా పవర్ సేవింగ్‌కు అవకాశం లేదు. ఇందు కోసం ఇన్వర్టర్ మోడ్ ఉన్న ఫైవ్ స్టార్, త్రీస్టార్ రేటింగ్ ఏసీలను ఎంపిక చేసుకోవాలి. ఏసీలను రోజంతా ఆన్‌లో ఉంచడం వల్ల కంప్రెసర్‌లో హీట్ జనరేట్ అవుతుంది. ఇన్వర్టర్ బ్యాటరీలను గాలి, వెలుతురు లేని ఇరుకైన ప్రదేశంలో ఏర్పాటు చేయడం వల్ల ఒత్తిడికి గురై..షార్ట్‌సర్క్యూట్‌లు తలెత్తుతున్నాయి. ఇన్వర్టర్ బ్యాటరీల్లో మూడు నెలలకోసారి డిస్టిలరీ వాటర్ నింపాలి. వీటి నిర్వహణ లోపం వల్ల కూ దా బ్యాటరీలు పేలుతుంటాయి. గుల్జార్‌హౌస్‌లో వెలుగు చూసిన ప్రమాదానికి ఇది మరో కారణం కూడా.

ప్రాపర్ ఎర్తింగ్‌తోనే ఆస్తులకు, ప్రాణాలకు రక్షణ..

మెజార్టీ భవనాల్లో ఎర్తింగ్ సిస్టం ఉండటం లేదు. ఒక వేళ ఉన్నా.. సరఫరాలో హెచ్చు తగ్గుల సమస్య వచ్చినప్పుడు పని చేయడం లేదు. వేసవిలో ఎర్తింగ్ పాయింట్లో తేమ శాతం తగ్గుతుంది. ప్రతి పదిరోజుకో సారి నీటిని పోయడం ద్వారా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు తలెత్తినప్పుడు ఆస్తి, ప్రాణ నష్టాలను నివారించొచ్చు. అంతేకాదు పోల్ నుంచి ఇంట్లోకి కరెంట్ సరఫరా చేసే సర్వీసు వైరు వెంట సాధారణంగా జీఏవైర్‌ను ఏర్పాటు చేస్తుంటాం. షార్ట్ సర్క్యూట్ కారణంగా పోల్‌పై ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తినప్పుడు హై ఓల్టేజ్ విద్యుత్ ఇంట్లోకి ప్రవేశించకుండా నియంత్రించేందుకు ఎగ్ ఇన్సులేటర్ వినియోగించాలి. విద్యుత్ లీకేజీలు లేకుండా చూసుకోవడం, ప్రతి ఇన్సు లేషన్‌కు ఎంసీబీలు, ఆర్సీసీబీలను ఏర్పాటు చేసుకోవడం వల్ల విద్యుత్ ప్రమాదాలు తలెత్తకుండా చూసుకోవచ్చు అని కాంతారావు స్పష్టం చేశారు.